'పది' మూల్యాంకనం 21.57 శాతం పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం రెండో రోజు శుక్రవారం నాటికి 21.57 శాతం పూర్తయినట్లు డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. ఒకేషనల్ మినహా 30,703 జవాబుపత్రాల మూల్యాంకనం చేసినట్లు తెలిపారు. రెండోరోజు చీఫ్ ఎగ్జామినర్లు 90 మంది, 585 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 164 మంది స్పెషల్ అసిస్టెంట్లు హాజరయ్యారని తెలిపారు. పదో తరగతి ఓపెన్ పరీక్షలకు సంబంధించి 16,220 జవాబు పత్రాలు రాగా, 2743 పేపర్లు మూల్యాంకనం చేయడంతో 18 శాతం పూర్తయిందని తెలిపారు. 16 మంది చీఫ్ ఎగ్జామినర్లను, 88 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను, 18 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించినట్లు డీఈవో తెలిపారు. మూల్యాంకనానికి హాజరైన వారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా విద్యాధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు.

ఉర్దూ వర్సిటీకి జీడీసీ భవనాలు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర డిగ్రీ (జీడీసీ) కళాశాల భవనాల్లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీని కొనసాగించడానికి డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారని రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. ఈనెల చివరిలోపు కళాశాల గదులను ఖాళీ చేసి ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కళాశాల నూతన భవనంలోకి మార్చితే అందులో ఉర్దూ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉంటున్న కళాశాలకు నెలకు రూ.3 లక్షల అద్దె చెల్లించడంతో పాటు విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో పాటు రక్షణ లేకుండా పోతోందనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా తమకు జీడీసీలో ఏర్పాటుకు అవకాశం ఇచ్చారని తెలిపారు.

నేడు జగ్జీవన్‌రామ్ జయంతి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని, దివంగత డా.బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రంజిత్ బాషా అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు కర్నూలు నగరంలోని ఆర్ఎస్ రోడ్డు కూడలిలోని బాబు జగ్జీవన్‌రామ్ సర్కిల్‌లో జయంతి ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. ముందుగా బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళి అర్పించి అక్కడే సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, దళిత ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరారు.

అధరహో

పత్తి క్వింటా గరిష్ఠంగా రూ.8,019 ● రైతుల్లో సంతోషం



ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర శుక్రవారం ఆధర హో అనిపించింది. శుక్రవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.8019 చేరుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లోనే ఈ ధర రికార్డ్. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పతనమై కనీస మద్దతు ధర కంటే తక్కువగా పలికాయి. దీంతో సీసీఐకి పత్తి రైతులు తమ పత్తిని మద్దతు ధరకు విక్రయించుకున్నారు. రైతులు 90శాతం పైగా పత్తి దిగుబడులు విక్రయించుకున్నాక మళ్లీ ధరలు పెరుగుతండడంతో కొందరు నిరాశ చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దూది పత్తి దింజల ధరలు పెరగడం వల్ల స్థానిక మార్కెట్‌లో ధరలు పెరగడానికి కారణం అయిందని కాటన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యుడు నీలకంఠ తెలిపారు. మరికొంత స్వల్పంగా పత్తి ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. 659 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5016, మధ్యస్థ ధర రూ.7678 పలికింది.



నగరం మధ్యలో హంద్రీ కుచించుకుపోయిన నది...
నది బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ భవనాలు

మాయమవుతున్న హంద్రీ..!

హంద్రీ కర్నూలు నగరం మధ్యలో 7.40 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. స్థిరాస్తుల విలువ భారీగా పెరగడంతో నది కుడి, ఎడమ గట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇష్టారాజ్యంగా నది ఒడ్డును చదును చేసి ఇళ్లు కట్టేస్తున్నారు. హంద్రీ ఆక్రమణలపై ఆంధ్రజ్యోతి పలు కథనాలు ప్రచురించింది. జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు ఎట్టకేలకు స్పందించారు. జాయింట్ కలెక్టర్ నవ్య దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ ఇంజనీర్లు సంయుక్తంగా హంద్రీ సరిహద్దు గుర్తింపు సర్వే నిర్వహించారు. నదీ తీరం వెంబడి 338 ఆక్రమణలు గుర్తించారు. ఆక్రమణదారుల్లో నగరంలో పేరుమోసిన బడా రియల్టర్ ఒకరు ఉన్నారు. నది సరిహద్దుల్లో పిల్లర్లు నాటుతున్నారు. అధికారులు ఈ అక్రమణలు తొలగిస్తారా..? రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేస్తారా..? వేచి చూడాలి.

- దర్గాగా కుడి, ఎడమ గట్ల ఆక్రమణ
- 338 ఆక్రమణల గుర్తింపు
- ఆక్రమణదారుల్లో ఓ బడా రియల్టర్
- పూర్తి వివరాలతో నివేదిక పంపిన జలవనరుల శాఖ ఇంజనీర్లు
- నది సరిహద్దు సర్వేలో వెలుగు చూసిన వాస్తవాలు

కర్నూలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర తరువాత జిల్లాలో ప్రవహించే అతిపెద్ద నది హంద్రీ. పత్తికొండ మండలం పందికోన కొండల్లో ఒక పాయగా, చిన్నహుల్తి ఎగువన మరో పాయ (వంక)గా ప్రవహించి, దేవనకొండ మండలం అలారుదిన్నె సమీపంలో హంద్రీ నదిగా రూపాంతరం చెందుతుంది. దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల, కోడుమూరు, కల్లూరు మండలాల్లో ప్రవహించి, కర్నూలు నగర శివారు జొహరాపురం బిడ్జి దిగువన తుంగభద్రలో కలుస్తుంది. నగరం మధ్యలో 5.40 కి.మీలు ప్రవహించే హంద్రీ వివిధ ప్రాంతాలలో 200 నుంచి 300 మీటర్ల వెడల్పు ఉండాలి. గరిష్ఠ వరద ప్రవాహం అంచుల (మ్యాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్-ఎంఎఫ్ఎల్) నుంచి 50 మీటర్లు (150 అడుగులు) వరకు బఫర్ జోన్ ఉంటుందని జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు తెలిపారు. కోడుమూరు మండలంలో మొదలైన వక్కేరు వాగు ప్యాలకుర్తి, పెంచికలపాడు, నెరవాడ, సలకాపురం, పెద్దపాడు మీదుగా ప్రవహిస్తూ కల్లూరు వద్ద హంద్రీలో కలుస్తుంది. నగరం పరిధిలో వక్కేరు వాగుగడ్డ వెడల్పు (బఫర్ జోన్) 30-50 అడుగుల వరకు ఉంటుందని ఇంజనీర్లు తెలిపారు. నగరంలో స్థిరాస్తుల విలువ భారీగా పెరగడం, నగరం మధ్యలో ఉండడంతో అక్రమార్కులు నది ఒడ్డు ప్రభుత్వ భూములపై కన్నేశారు. రాజకీయ నాయకుల అండతో దర్గాగా ఆక్రమించేశారు. కొందరైతే ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కూడా చేస్తున్నట్లు తెలుస్తుంది.

నదిలో అక్రమ నిర్మాణాలు...



338 ఆక్రమణలు గుర్తింపు

హంద్రీ నది కుడి, ఎడమ గట్లు ఎక్కడికక్కడే ఆక్రమణలకు గురయ్యాయి. 1997లో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రెండుసార్లు లక్ష క్యూసెక్కులకు పైగా వరద రావడంతో నదీ తీర కాలనీలు ముంపుకు గురయ్యాయి. 2007లో మరోసారి వరద వచ్చి కాలనీలను ముంచేసింది. 2009లో ఊహించని వరదతో జనం భారీ నష్టాన్ని చవి చూశారు. వరద ముప్పు నుంచి ప్రజలను రక్షించాలనే లక్ష్యంగా ఫ్లడ్ వాల్ నిర్మాణాలకు రూ.150 కోట్లు మంజూరు చేశారు. పనులు మొదలు పట్టేందుకు వెళ్లిన ఇంజనీర్లకు ఆక్రమణలు అడ్డుగా నిలిచాయి. ప్రజా ప్రతినిధులు, రాజకీయ బడా నాయకులు సైతం ఆక్రమణదారులకే వత్తాసు పలికారు. ఫలితంగా పనులు మొదలు కాలేదు. నిధులు వెనక్కి వెళ్లాయి.



హంద్రీ నది సరిహద్దులు గుర్తించి పిల్లర్లు నాటుతున్న ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది

మిగతా 6వ పేజీలో

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

- కర్మాగారాల్లో మహిళలకు వసతులు కల్పించాలి
- కార్మిక, కర్మాగార, బాయిలర్స్ సర్వీసెస్ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాల్లో బాలలతో పనులు చేయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్మిక, కార్మాగార, బాయిలర్స్ సర్వీసెస్ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు అన్నారు. శుక్రవారం కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలోని కార్మిక శాఖ, కర్మాగారాల శాఖ అధికారులు, ఫ్యాక్టరీ యజమానులు, సీఐటీయూ,ఏఐటీయూసీ నాయకులతో జిల్లా పరిషత్ సమావేశభవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. ఏదైనా సంస్థల్లో పది లేదా ఆపైన కార్మికులు పని చేస్తుంటే నెల జీతం రూ.21 వేల లోపు ఉంటే ఈఎస్ఐ చట్టం కింద పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. పరిశ్రమలు, కర్మాగారాల్లో పని చేసే మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని గుర్తించి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాయలసీమ జోన్ సంయుక్త కమిషనర్ ఎం.బాలునాయక్, విజయవాడ కమిషనరేట్ సంయుక్త కమిషనర్లు లక్ష్మీనారాయణ, ఏ.గణేషన్, సహాయక కమిషనర్ ఆదినారాయణ, ఉప కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంధం చంద్రుడు



పాల్గొన్న అధికారులు, ఫ్యాక్టరీ యజమానులు, సీఐటీయూ,ఏఐటీయూసీ నాయకులు

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ● ఏపీ ఈఆర్సీ ఎదుట సీపీఐ నిరసన

కల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరులోని ఏపీఈఆర్సీ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారంగా వేసిన యూజర్ చార్జీలను తగ్గిస్తామని అప్పట్లో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు ఇప్పుడు సెకీ ఒప్పందాన్ని ఉపసంహరించుకుని యూజర్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీపీఏ ఒప్పందంపై కమిషన్ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్ పీవీఆర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు రామకృష్ణారెడ్డి, గిడ్డమ్మ, శ్రావణి, భారతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఏపీఈఆర్సీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

జిల్లా జైలు తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు లీగల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పంచలింగాలలోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. జైలు విజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన తనిఖీ చేసి వాటి ప్రయోజనాల గురించి ఖైదీలకు వివరించారు. ఈ క్లినిక్‌లో ఒక అడ్వకేట్, ఒక పారా లీగల్ వలంటీర్ సభ్యులుగా ఉంటారని, వారు ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయాన్ని అందజేస్తారని తెలిపారు. జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేసుకుని సమాజంలో మంచి వ్యక్తులుగా సాగాలని తెలిపారు. 70ఏళ్ల వయస్సు నిండిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడే ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందజేసి వారికి త్వరగా బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఆ తర్వాత స్థానిక మహిళా జైలును చేశారు. బి.క్యాంపులోని జువనైల్ హోమ్‌ను తనిఖీ చేసి అక్కడుంటున్న బాలలకు బాలల హక్కుల చట్టాల గురించి వివరించారు. జువనైల్ మెజిస్ట్రేట్ అపర్ణ, సభ్యులు మాధవి, సునీత, న్యాయవాది లక్ష్మీనారాయణ, అబ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ హుసేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కల్పించాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలకు, అమ్మాయిల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి అమల్లోకి తెచ్చిన శక్తి యాప్ పట్ల జిల్లాలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తమ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ఆపద సమయాల్లో పోలీసుల సహాయం పొందేలా చైతన్యం చేయాలన్నారు. శక్తి యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక ఘటనలను నివారించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో గృహిణులు, ఉద్యోగినులు, విద్యార్థినులు మహిళలు శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ శక్తి యాప్ మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసాచారి పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఐదు శక్తి టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, పత్తికొండ ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను నియంత్రించడం కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్ సమావేశాలు, వీడియోలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలకు శక్తి టీం ఎస్ఓఎస్ యాప్ ఉపయోగాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, పోక్సో, సామాజిక మాధ్యమాల వినియోగంపై స్పష్టమైన అవగాహన కల్పించారు. అలాగే డయల్ 112, 1098, 181, సైబర్ మోసాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి అవగాహన కల్పించాలన్నారు.



మహానంది మండలంలో దెబ్బతిన్న అరటి చెట్లు

రైతు కష్టం వర్షార్పణం

- అకాల వర్షాలకు భారీగా పంటనష్టం
- నంద్యాల జిల్లాలో 2,242 హెక్టార్లలో వరి
- 111 హెక్టార్లలో మొక్కజొన్న, జొన్న అరటి పంటలకు నష్టం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు కష్టపడిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. పంటచేతికొచ్చే సమయానికి అకాల వర్షం రైతు ఆశలను అతలాకుతలం చేసేసింది. కోతకు వచ్చిన వరి, కల్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు కాపుకాసిన అరటి చెట్లు వర్షానికి నేలకొరిగాయి. నంద్యాల జిల్లాలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తోడు ఈదురుగాలులు తోడు కావడంతో నిలువునా పంటలు నేలకూలి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. దీంతో రైతులు అధికంగా సాగు చేసే అరటి, వరి పంటలు నేలవాలాయి. దీంతో రూ.లక్షల్లో పంట నష్టం వచ్చింది. పంటలపై పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించింది. వ్యవసాయాధికారులు వెల్లడించిన ప్రాథమిక అంచనాల ప్రకారం సంజామల మండలం గిద్దలూరు గ్రామ పరిధిలో అరటి 12 హెక్టార్లు, పేరుసోముల గ్రామ పరిధిలో 5 హెక్టార్లు, కొలిమిగుండ్ల మండలం చింతలాయ పల్లె గ్రామ పరిధిలో 10 హెక్టార్లలో అరటి నేలకూలింది. అలాగే బండిఆత్మకూరు మండలంలో వరి 1,942 హెక్టార్లు, గడివేముల మండలంలో 70 హెక్టార్లు, మహానంది మండలంలో 212 హెక్టార్లు, వెలుగోడు మండలంలో 42 హెక్టార్లు, నంద్యాల మండలంలో 96 హెక్టార్లు, జూపాడుబంగ్లా మండలంలో 150 హెక్టార్లలో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గడివేముల మండలంలో 10 హెక్టార్లు, జూపాడుబంగ్లా మండలంలో 41 హెక్టార్లలో మొక్క.జొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. జూపాడుబంగ్లా మండలంలో 13 హెక్టార్లలో జొన్న పం టకూడా దెబ్బ తిన్నట్లు వ్యవసాయాధికారులు నివేదికలను జిల్లా కలెక్టర్ రాజకుమారికి సమర్పించారు.



మహానందిలో నేలను తాకిన వరి పంట

రక్తనిధి సేకరణ ఏదీ?

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం వేలసంఖ్యలో రోగులు వస్తుంటారు. రోగులకు సరైన సౌకర్యాలు లేక ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం నిల్వలు సమృద్ధిగా ఉంచాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రక్తం కావాలంటే వెంట డోనర్‌ను పిలుచుకొని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తసేకరణ చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కేవలం ఆస్పత్రికి స్వచ్ఛందంగా వచ్చేవారితోనే రక్తం సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా రక్తసేకరణ కోసం శిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆస్పత్రికి బస్సును ఏర్పాటు చేసింది. బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఈ బస్సుద్వారా రక్తశిబిరాలు నిర్వహించి రోగులకు అవసరమైన రక్తాన్ని సరఫరా చేయాల్సి ఉంది. రోగులకు అత్యవసర సమయంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది చేతులెత్తేయడంతో ప్రైవేట్ రక్త కేంద్రాలకు రోగుల బంధువులు పరుగులుతీస్తున్నారు. నంద్యాలలో ప్రభుత్వ ఆస్పత్రితోపాటు విజయ బ్లడ్ కేంద్రం, నంద్యాల బ్లడ్ కేంద్రాలు రోగులకు రక్తాన్ని సరఫరా చేస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటుచేసి డాక్టర్‌ను, స్టాఫ్ నర్సులు, సిబ్బందిని నియమించారు. 450 పడకల ఆస్పత్రిలో వంద యూనిట్లలోపే బ్లడ్ నిల్వ ఉండటం గమనార్హం. అంతేకాక ఏ-నెగెటివ్ బ్లడ్ ఆస్పత్రిలో అందుబాటులో లేదు. అలాగే బి-నెగెటివ్, ఏ, బీ - నెగెటివ్‌లు ఒక్కొక్క యూనిట్ మాత్రమే అందుబాటులో ఉంది.



ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తం నిల్వ ఉంచిన ఫ్రిజ్‌లు



అలంకారప్రాయంగా రక్త సేకరణ బస్సు

వేసవి కావడంతో ముందుకు రావడం లేదు



ప్రస్తుతం ఎండ తీవ్రత ఉండటంతో దాతలు రక్తం ఇవ్వడానికి ముందుకురావడంలేదు. కాంపోనెంట్ మిషన్ లేకపోవడంతో అరుదుగా దొరికే రక్తం కోసం బయటకు పంపాల్సివస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. రోగులకు అవసరమైన రక్తం అందుబాటులో ఉంది. ఆయా విభాగాల వైద్యులు నేరుగా రక్తం కోసం బయటకు పంపుతున్నారు.
- డాక్టర్ లింగేశ్వరరావు, నంద్యాల

- సర్వజన ఆస్పత్రిలో రుధిర కొరత
- బ్లడ్ కాంపొనెంట్స్ మిషన్ లేక రోగుల అవస్థలు
- డోనర్ ఉంటేనే బ్లడ్ ఇచ్చే పరిస్థితి
- స్థాయి పెంచారు.. సౌకర్యాలు మరిచారు

గత మూడు నెలల్లో రక్త సేకరణ ఇలా...

సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది గత మూడు నెలల్లో 7 సార్లు మాత్రమే రక్తసేకరణ శిబిరాలు నిర్వహించింది. జనవరి 13న రైతునగర్‌లో 31 యూనిట్లు, 18వ తేదీన బనగానపల్లెలో 30 యూనిట్లు సేకరించారు. ఫిబ్రవరి 11న కోవెలకుంట్ల ఆర్టీసీ సిబ్బందినుంచి 23 యూనిట్లు, 12వ తేదీన నంద్యాల ఆర్టీసీ సిబ్బంది నుంచి 48 యూనిట్లు, 14వ తేదీన బనగానపల్లె ఆర్టీసీ సిబ్బంది నుంచి 25 యూనిట్లు సేకరించారు. మార్చి 7న ఆస్పత్రిలోనే 12 యూనిట్లు, 16వ తేదీన ఎన్‌జీవో కాలనీలోని బ్యాంక్ కోచింగ్ సెంటర్‌ద్వారా 64 యూనిట్లు సేకరించారు.

కాంపొనెంట్స్ మిషన్ మరిచారా?

రక్తాన్ని వేరుచేసే అత్యంత విలువైన కాంపోనెంట్ మిషన్‌ను ఏర్పాటు చేయడం మరిచిపోయారు. రక్తంలోని ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్త కణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్లను వేరుగా చేసే కాంపోనెంట్ మిషన్‌లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేరుచేసిన కణాలను నిల్వ ఉంచేందుకు మిషన్లు ఉన్నాయే కానీ అవసరమైన కాంపొనెంట్ మిషన్‌లేకపోవడంతో ఇవి వృథాగా మారిపోయాయి. జిల్లా కేంద్రంలో ఆస్పత్రి స్థాయిని పెంచారేకానీ అవసరమైన కాంపొనెంట్ మిషన్‌ను కొనుగోలు చేయకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.



నంద్యాలలోని బ్లడ్‌బ్యాంక్

సిల్వర్ సెట్-2025 నోటిఫికేషన్ జారీ

- రేపటి నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 18న ప్రవేశ పరీక్ష



సిల్వర్ సెట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రత్యేకత కలిగిన సిల్వర్ జూబ్లీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి సిల్వర్ సెట్ నోటిఫికేషన్‌ను రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు జారీ చేశారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలోని తన చాంబర్‌లో నోటిఫికేషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. 13 కోర్సుల్లో 280 సీట్ల భర్తీ కోసం ఈనెల 6 నుంచి 30 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని, మే 18న రాష్ట్రంలోని 14 పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. బీఎస్సీలో 120 సీట్లు, బీజెడ్‌సీలో 80, బీఏ 40, బీకాం జనరల్ 20, కంప్యూటర్ అప్లికేషన్ కోర్సుల్లో 20 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో 12 పరీక్ష కేంద్రాలు, కర్నూలు జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్వీ వర్సిటీ పరిధిలోని జిల్లాలకు 35శాతం, ఆంధ్ర వర్సిటీ పరిధిలోని జిల్లాలకు 65 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తామని తెలిపారు. అందులో విద్యార్థినులకు 33 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ ఓపెన్‌లో కూడా విద్యార్థినులకు సీట్ల భర్తీలో అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీలో కొత్తగా 23 పీజీ కోర్సులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీలో కొత్తగా 23 పీజీ కోర్సులను ప్రారంభించబోతున్నామని రిజి స్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన కొత్త కోర్సుల వివ రాలను వెల్లడించారు. డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఉన్నత విద్యలో కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దేశంలోనే ప్రత్యేక వసతులను ఏర్పాటైన క్లస్టర్ వర్సిటీపై విద్యార్థులకు అవగాహన ఎంతో అవసరమని చెప్పారు.

మార్కెట్ యార్డు అక్రమాలపై కలెక్టర్ సీరియస్

విచారణ చేయాలని జేడీకి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్ యార్డులోని ఓ కీలక అధికారి దందాపై 'పైసా వసూల్..!' శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. సదరు యార్డులోని అక్రమాలపై కథనం రావడంతో సంబంధిత అధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. పత్రికలో వచ్చిన అంశాలతో పాటు గతంలో జరిగిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేయాలని ఆశాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను ఆదేశించారు. ఆ తర్వాత ఇచ్చిన నివేదిక ప్రకారం జాయింట్ కలెక్టర్ ద్వారా కూడా విచారణ చేయిస్తామని కలెక్టర్ తెలియజేశారు.

ప్రయాణం ఆటో..ఇటో..!

- ఆటో టాపుపై విద్యార్థుల ప్రయాణం
- చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న ట్రాఫిక్, పోలీసులు



ఆటోలో పరిమితికి మించి కూర్చుని ప్రయాణం చేస్తున్న విద్యార్థులు, ప్రజలు

కోసిగి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదం. కానీ ఆటోల డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకొని రై..నా వెళ్తున్నారు. శుక్రవారం కోసిగి మండలం గౌడుగల్లు, జుమాలదిన్నె గ్రామాలకు వెళ్లే ఆటోలో డ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఆటో టాప్‌పై విద్యార్థులనూ ఎక్కించుకున్నాడు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రయాణికులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాయమవుతున్న హంద్రీ..!

(5వ పేజీ తరువాయి)

అయితే.. నదీ ఆక్రమణలపై పలు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఇరిగేషన్ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఈఈ నారాయణరెడ్డి, డీఈఈ రామకృష్ణారెడ్డి జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశాలతో రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తే విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. కుడిగట్టు (రైట్ బ్యాంక్) వెంబడి 164, ఎడమ గట్టు (లెఫ్ట్ బ్యాంక్) వెంబడి 174 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. కబ్జా స్థలాల్లో మెజార్టీగా ఆర్‌సీసీ భవనాలు నిర్మించారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా నది సరిహద్దు పిల్లర్లు

జలవనరుల శాఖ పరిధిలోని కాలువలు సర్వే చేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఓ నదిని సర్వే చేసిన సరిహద్దులు గుర్తించి పిల్లర్లు ఏర్పాటు చేయడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమమని అధికారులు అంటున్నారు. దాదాపు రూ.16 లక్షల ఖర్చుతో పది అడుగులు ఎత్తు, నాలుగు వైపులు అడుగు మందంతో బలమైన స్టీల్ వినియోగించి సిమెంట్ పిల్లర్లు తయారు చేయించారు. రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి సరిహద్దు గుర్తిస్తున్నారు. భూమిలో ఐదు అడుగుల లోతులో సిమెంట్ పిల్లర్లు పాతుతున్నారు. పిల్లరు మధ్యలో ఉన్నది నది పోరంబోకు ప్రభుత్వ భూమి. ఆ పిల్లరు నుంచి 150 అడుగుల వరకు బఫర్ జోన్ ఉంటుంది. అక్కడి వరకు ఎలాంటి భవనాలు నిర్మించరాదని అధికారులు పేర్కొంటున్నారు.

సర్వే నంబర్లు వారిగా గుర్తించిన హంద్రీనది కుడి, ఎడమ వైపు ఆక్రమణలు

సర్వే నంబరు	కుడి వైపు	ఎడమ వైపు
770/ఎఫ్	--	1
422/ఎ	--	--
424/ఏ	2	4
470/బి	145	33
498/ఎ	8	24
533	8	110
24	1	2
మొత్తం	164	174



హంద్రీ నది సరిహద్దులు గుర్తించి పిల్లర్లు నాటుతున్న ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది

హంద్రీ ఆక్రమణలు అరికట్టేందుకు సరిహద్దు పిల్లర్ల ఏర్పాటు

హంద్రీ నది కర్నూలు నగరం మధ్యలో 7.40 కి.మీ ప్రవహిస్తుంది. కుడి, ఎడమ గట్ల వైపు ఆక్రమణలు ఉన్నమాట నిజమే. రెవిన్యూ, సర్వే అధికారులతో కలసి నది సరిహద్దులు గుర్తించి పిల్లర్లు (ఆర్‌సీసీ దిమ్మెలు) నాటుతున్నాం. హంద్రీ నదిని ఆక్రమణల నుంచి కాపాడేందుకు జిల్లా అధికారుల ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నాం. నది రెండు వైపుల 334 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించాం. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదించాం. పైఅధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించే చర్యలు కూడా తీసుకుంటాం.
- బి. రామకృష్ణ, డీఈఈ, ఇరిగేషన్ ఎఫ్ఆర్ఎల్ డివిజన్, కర్నూలు



విస్తుగొలిపే వాస్తవాలు

- హంద్రీ కుడి గట్టు (రైట్ బ్యాంక్) వైపు 164 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. అందులో బడా రియల్టర్ ఒకరు సర్వే నంబరు 424/ఏ, 470/బి పరిధిలో 15 ప్లాట్లు వేసి పక్కా భవనాలు నిర్మించారని గుర్తించారు. సర్వే నంబరు.470/బిలో 25 ప్లాట్లలో బెస్‌మట్టం వరకు నిర్మాణాలు చేపట్టారని, ఇవన్ని ఆక్రమిత స్థలం, బఫర్ జోన్‌లో ఉన్నాయని గుర్తించి నివేదిక పంపించారు. సర్వే నంబరు.740/బి, 498/ఎ, 533, 24 పరిధిలో పలువు 1.25 సెంట్లలో పక్కా భవనాలు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో కొందరికి రెవెన్యూ అధికారులు డి.పట్టా ఇచ్చినట్లు తెలుస్తుంది. ఓ వెంచర్ యజమాని 40 సెంట్లు హంద్రీ నది ప్రభుత్వ ఆక్రమించినట్లు కూడా గుర్తించారు.
- యడమ గట్టు (లెఫ్ట్ బ్యాంక్) వైపు 174 ఆక్రమణలు గుర్తించారు. మెజార్టీగా ఆర్‌సీసీ భవనాలు నిర్మించుకున్నారు. సర్వే నంబరు.770/ఎఫ్ పరిధిలో ఓ ఫైనాన్స్ సంస్థ భవనం కొంతభాగం హంద్రీ నది ఒడ్డున ఉన్నట్లు గుర్తించారు.

వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని, రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. మే 31న నిర్వహించనున్న సిద్దేశ్వరం అలుగు శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ విధానాలు -వెనుకబడిన ప్రాంతాల భవిత పేరుతో సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నంద్యాలలోని ఐఎంఏ సమావేశ భవనంలో ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. బొజ్జా మాట్లాడుతూ పాలకుల లోపభూయిష్ట విధానాల వల్ల రాయలసీమ సామాజికంగా ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంసీ కొండారెడ్డి, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న ఎం.కృష్ణాపురం బాలీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కోసం అర్హులైన గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీస్, సర్వే అసిస్టెంట్, వీఆర్వో, వార్డ్ రెవెన్యూ కార్యదర్శి, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీలు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సీపీవో హిమప్రభాకర్‌రాజు తెలిపారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో ఐదుగురు, నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్‌లో 35 మంది ఏడాది కాల పరిమితితో డిప్యుటేషన్‌పై పని చేయాలని తెలిపారు. దరఖాస్తులను 7వ తేదీ ఉదయం 11 గంటలలోపు సీపీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆ రోజే మధ్యాహ్నం 2 గంటలకు స్క్రీనింగ్, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యాశాఖలో..

కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలులోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రం(డైట్)లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఎఫ్ఎస్‌టీ డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేయడానికి గాను అర్హత గలిగిన ప్రభుత్వ జడ్పీ, మున్సిపల్ యాజమాన్య పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు దరఖాస్తు చేసుకునేందుకు ఏపీ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి అర్హత కలిగిన వారు ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు ప్రింట్ తీసుకుని దానికి అర్హత ధ్రువీకరణ జిరాక్స్ కాపీలను జతపరిచి సంబంధిత హెచ్ఎంలు, ఎంఈవోలు, ఉప విద్యాశాఖ అధికారి ద్వారా దరఖాస్తును స్వీకరించి డైట్ కళాశాలల పనివేళల్లో అందజేయాలని తెలిపారు. తర్వాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించబడవని చెప్పారు.

పుస్తకాల కోసం..

- అధికారులతో ప్రత్యేక కమిటీలు
- ప్రతి విద్యార్థికీ చేరవేయడమే లక్ష్యం
- తాజాగా ప్రభుత్వ మార్గదర్శకాలు



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో సమగ్రశిక్ష ద్వారా అధికారులతో జిల్లా స్థాయి, మండల స్థాయి, పాఠశాల స్థాయి కమిటీలను ఏర్పాటుచేశారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వం నుంచి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగు, 3 జతల యూనిఫాం క్లాత్, బెల్టు, ఒక జతషూస్, డిక్షనరీ, వర్క్‌బుక్స్ అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్ తెరిచే సమయానికి ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అందించేలాని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో ఎక్కడా పర్యవేక్షణా లోపం ఉండకూడదనే భావనతో ఒక నెల ముందుగానే జిల్లాస్థాయి, మండలస్థాయి, పాఠశాల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తూ సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంతకమార్ తాజాగా ఉత్తర్వులను జారీచేశారు.

మండలస్థాయి కమిటీ

1. మండల విద్యాధికారి-2 - టీమ్‌హెడ్
2. మండల విద్యాధికారి-1 - సభ్యులు
3. మండల ఇంజనీర్ - సభ్యులు
4. ఎంఐఎస్ లేదా డాటా ఎంట్రీ ఆపరేటర్ - సభ్యులు
5. ముగ్గురు కోఆర్డినేటింగ్ స్టాఫ్(సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు)

వీరందరూ పుస్తకాలను జిల్లాస్టాక్ పాయింట్లకు తీసుకోవాలి. ఆ తర్వాత స్టాక్ రిజిస్టర్‌ను మెయింటెనెన్స్ చేస్తూ ముందస్తు ప్రణాళిక ప్రకారం రూట్లను ఏర్పాటు చేసుకుని ట్రాన్స్‌పోర్ట్ ద్వారా స్కూళ్లకు పంపిణీ చేయాలి. ప్రతి స్కూలుకు ఏంఈవో తప్పనిసరిగా బయోమెట్రిక్ విధానం ద్వారా కిట్లను అందజేయాలి.

జిల్లాస్థాయి కమిటీ

1. ఏపీసీ(అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్) - టీమ్ హెడ్
2. సీఎంవో(కమ్యూనిటీమొబలైజనింగ్ ఆఫీసర్) - సభ్యులు
3. అసిస్టెంట్ సీఎంవో - సభ్యులు
4. ఎంఐఎస్ కోఆర్డినేటర్ - సభ్యులు
5. ఏపీవో (అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్) - సభ్యులు

వీరంతా జిల్లాస్థాయి, మండలస్థాయి స్టాక్ పాయింట్లను గుర్తించి, కిట్‌లను మండలస్థాయి టీమ్‌లకు అందజేయాలి. అలాగే జిల్లా స్థాయి అన్ని మండలాల స్టాక్‌పాయింట్లను పర్యవేక్షిస్తూ ప్రతిరోజు ప్రభుత్వానికి నివేదిక పంపాలి. ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ వంద శాతం విజయవంతం చేయాలి.

పాఠశాల స్థాయి కమిటీ

1. పాఠశాల ప్రధానోపాధ్యాయులు
2. గ్రామ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా పంచాయితీ కార్యదర్శి
3. మహిళా పోలీస్
4. ఇద్దరు పేరెంట్ కమిటీ సభ్యులు

వీరందరూ విద్యార్థులకు బయెమెట్రిక్ విధానం ద్వారా పుస్తకాలను పంపిణీ చేయాలి. రికార్డును మెయింటెనెన్స్ చేస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు నివేదికను అందజేయాలి. ఏ సమస్య వచ్చినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలి.

కనీస మద్దతు ధర ప్రకటించాలి


మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

- కేరళ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్
- కర్నూలులో జాతీయ రైతు సదస్సు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కేరళ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని లక్ష్మీ నరసింహకల్యాణ మండపంలో ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం అధ్యక్షతన జాతీయ రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రితో పాటు ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. ఏపీలో సీపీఐకి తెలంగాణ రైతాంగ పోరాటం చేసిన చరిత్ర ఉందన్నారు. అధికారం లోకి రాకముందు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార సులు అమలు చేస్తామని చెప్పిన మోదీ మాట తప్పారని విమర్శించారు. ఫసల్ బీమా పథకం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం భూసంస్కరణ చట్టం తీసుకువచ్చిందన్నారు. రైతులకు ఉపయోగపడే చట్టాలను తీసుకువచ్చే విషయంలో సీపీఐ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. రైతుల సమస్యలపై చర్చించి జాతీయ మహాసభలలో తీర్మానం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామ న్నారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహయాదవ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుగు నరసింహులు యాదవ్, రైతు సంఘం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే హయాంలో రైతుల ఆత్మహత్యలు

మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో సుమారు 3.49లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతుల ఆదాయం పెంచుతామని చెప్పిన మోదీ కార్పొరేట్ శక్తుల ఆదాయం పెంచే పనిలో ఉన్నారు. మద్దతు ధర లేక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులకు మోదీ అనుకూలంగా ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. వెంటనే రైతులకు వ్యతిరేకంగా చేసిన నల్ల చట్టాలను రద్దు చేయాలి. కనీస మద్దతు ధర చట్టబద్దత కల్పించాలి. **- రావుల వెంకయ్య, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి**

కమ్యూనిస్టుల పోరాటం అభినందనీయం



రైతు సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులు, ఏపీ రైతు సంఘం చేస్తున్న పోరాటాలు అభినందనీయం. తాను స్వతహాగా రైతునని చెప్పుకోవడానికి గర్వపడుతున్నా. మంత్రిగా పని చేస్తున్న సమయంలో రైతుల కోసం ఆహర్నిశలు కృషి చేశాను. ఉపాధి హామీ చట్టం వ్యవసాయానికి అనుసంధానం చేయాలనే డిమాండ్ చాలా మంచిది. రైతుల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాల్లో తమ మద్దతు ఉంటుంది. రాయలసీమ ప్రాంతంలో పెండింగ్ ప్రాజెక్టులతో పాటు వేదవతి, గుండ్రేవుల, సిద్దేశ్వరం, అలుగు పూర్తి చేయాలి. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల నుంచి రైతులకు రుణమాఫీ చేయలేదు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలను రైతుల ఖాతాల్లో జమ చేయాలి. **- ఎన్.రఘువీరా రెడ్డి, మాజీ మంత్రి**

దేశాన్ని కాపాడేది లౌకిక పార్టీలే



దేశాన్ని కాపాడేది లౌకిక పార్టీలే. బీజేపీ దేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టి మరోమారు అధికార చేజిక్కించుకోవాలని ప్రయత్నం చేస్తోంది. మోదీ ప్రభుత్వం వ్యవసాయం గురించి ఎప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రైతులను ఆదుకోవడంలో కేంద్రం విఫలమైంది. అంబాని, అదానికి ఊడిగం చేయడం తప్ప రైతులకు చేసిందేమి లేదు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోకుండా మోదీ మాయలో ఉన్నారు. **- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ**

సెస్సు వసూలు లక్ష్యం రూ.67 కోట్లు

- మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి మార్కెటింగ్ శాఖకు రూ.67 కోట్ల సెస్సు లక్ష్యాన్ని రాబట్టాలని రెండు జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, ఏడీఎంలు నారాయణమూర్తి, రెహమాన్‌కు లక్ష్యాన్ని నిర్దేశించామని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం కర్నూలు ఏడీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ కమిటీ నుంచి రూ.8.70 కోట్లు, ఆదోని నుంచి రూ.18 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి 8.50 కోట్లు, ఆలూరు నుంచి 1.10 కోట్లు, పత్తికొండ మార్కెట్ కమిటీ నుంచి రూ.95 లక్షలు, కోడుమూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.1.80 కోట్లు, మంత్రాలయం మార్కెట్ కమిటీ నుంచి రూ.1.35 కోట్లు సెస్సు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు సెస్సును వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు జేడీ తెలిపారు. తెలిపారు. నంద్యాల జిల్లాలో నంద్యాల నుంచి రూ.6.30 కోట్లు, ఆళ్లగడ్డ నుంచి రూ.6 కోట్లు, డోన్ మార్కెట్ కమిటీ నుంచి రూ.1.45 కోట్లు, నందికొట్కూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.3.65 కోట్లు, ఆత్మకూరు నుంచి రూ.5.30 కోట్లు, బనగానపల్లె మార్కెట్ కమిటీ నుంచి రూ.1.10 కోట్లు, కోవెలకుంట్ల నుంచి రూ.1.30 కోట్లు, పాణ్యం నుంచి రూ.1.56 కోట్లు సెస్సు రూపాల్లో వసూలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించామని తెలిపారు. ఏ మాత్రం అశ్రద్ధ చూపినా సెక్రటరీలు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట ఉత్ప త్తుల క్రయవిక్రయాలు జరిగే ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ యార్డులో రైతులు తెచ్చే పంట ఉత్పత్తులకు భద్రత కల్పించడంతో పాటు ఎండ, వర్షానికి రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్లాట్‌ఫారాలను కవర్డ్ ప్లాట్‌ఫారాలను, గోదాములను ఏర్పాటు చేసేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

రీ సర్వే పరిశీలన

కర్నూలు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ.తాండ్రపాడు గ్రామంలో రీసర్వేను ఎస్ఎస్ఎల్ఆర్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు, సీసీఎల్ఏ అడిషినల్ కమిషనర్ కె.శ్రీనివాసులు సంయుక్తంగా పరిశీలించారు. గ్రామంలో రీసర్వే ఏ విధంగా జరుగుతోందని సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. భూములను సర్వే చేసేటపుడు సంబంధించిన రైతులను పిలుస్తున్నారా? లేదా?, నోటీసులు ఏవిధంగా తయారు చేసి వారికి ఇస్తున్నారు? అని అడిగారు. ప్రధానంగా ఈ.తాండ్రపాడు తెలంగాణ రాష్ట్రం ఆనుకొని ఉన్న నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులో రీసర్వే ప్రక్రియ ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. బైరాపురం రోడ్డులో రాష్ట్ర ఉన్నతాధికారికి సర్వేపై కూలంకుశంగా సర్వేయర్లు వివరించారు. కల్లూరు మండలం పర్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వేను కూడా పరిశీలించారు. కర్నూలు డీసీఎల్‌వో మునికన్నన్, రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు డివిజనల్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు ఉన్నారు.


రీ సర్వేను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలివీ.. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో అలువాల గ్రామానికి చెందిన ఈడిగ వెంకటేశ్వర్లు కండక్టర్‌గా పని చేస్తున్నారు. గత నెల 30న ఎమ్మిగనూరు నుంచి పెద్దనేలటూరు బస్సు సర్వీసుకు వెంకటేశ్వర్లు విధులు నిర్వహించారు. ఆరోజు డైవందిన్నె స్టేజి దగ్గర బస్సు నిలకుండా మరి కొంత దూరంలో బస్సు నిలబడింది. స్టేజి దగ్గర ఎందుకు బస్సును నిలపలేదని పెద్దనేలటూరు గ్రామానికి చెందిన భూషణం కండెక్టర్‌తో గొడవ పడ్డాడు. బస్సులో వారు ఇద్దరికి సర్ది చెప్పారు. అప్పటికి గొడవ సర్దుమణిగింది. అయితే అదే రోజు రాత్రి పెద్దనేలటూరులో బస్సు నైట్ హాల్ట్‌లో ఉంది. భూషణం గత నెల 31న ఉదయం కండక్టర్ వెంకటేష్‌తో మళ్లీ గొడవ పడి చెప్పుతో దాడి చేశాడు. దీంతో కండక్టర్ ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతిని బెదిరించిన యువకుడిపై..

ఆదోని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీకి చెందిన గణేష్ అనే యువకుడుపై ఎస్సీ ఎస్టీ కేసుతో పాటు అత్యాచారయత్నం, ఐటీ యాక్ట్ నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు. వివరాల మేరకు.. ఎస్‌కేడీ కాలనీలో నివాసముంటున్న గణేష్ పట్టణానికి చెందిన 22 ఏళ్ల అమ్మాయితో పరిచయం పెంచుకుని, ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. అసభ్యకర ఫొటోను పంపి, తన ప్రేమను ఒప్పుకోకపోతే సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు శుక్రవారం రాత్రి 3టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గణేష్‌పై ఎస్సీ ఎస్టీ కేసుతో పాటు అత్యాచార యత్నం, ఐటీ యాక్టు నమోదు చేసినట్లు సీఐ రామలింగమయ్య తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదోని రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన హజ్జ మహదేవపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఈనెల 1వ తేదీన అదే గ్రామానికి చెందిన ఉచ్చరంగ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంలో వచ్చిన హజ్జ మహాదేవ ఢీకొటారు. తీవ్రంగా గాయపడ్డ ఉచ్చరంగను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హజ్జ మహదేవపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యర్రగుంట్లలో చైన్ స్నాచింగ్

శిరివెళ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకొని వెళ్లాడు. గురువారం రాత్రి వర్షం పడుతున్న సమయంలో యర్రగుంట్ల మెయిన్ రోడ్డు వద్ద ఉన్న కిరాణా దుకాణంలో వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి మహిళా యజమాని మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. ఆ సమయంలో వర్షం పడుతుండటంతో రహదారిపై జన సంచారం లేక పోవడంతో దుండగుడు బంగారు గొలుసుతో ఉడాయించాడు. ఎస్ఐ చిన్న పీరయ్య గ్రామానికి చేరుకొని సీసీ కెమెరా లను పర్యవేక్షించి విచారణ చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ ఒప్పంద ఉద్యోగి మృతి

- ట్రాన్స్‌ఫారాన్ని సరిచేస్తుండగా విద్యుదాఘాతం


ఈరన్న (ఫైల్)

ఆదోని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫారాన్ని మరమ్మ తు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. వివరా లమేరకు.. పట్టణంలోని రాజశ్రీహోటల్ వెనుక వైపు ట్రాన్స్‌ఫారంలో సమస్య ఏర్పడింది. దీంతో వారు విద్యుత్ అధికారులుకు ఫిర్యాచేయగా, అధికారులు కాంట్రాక్ట్ ఉద్యోగి కళ్ళుపోతుల ఈరన్నను పంపారు. ఈరన్న ట్రాన్స్ ఫారాన్ని సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి లోనై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి

గోనెగండ్ల, ఏఫ్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగందిన్నె గ్రామంలో గొల్ల శ్రీనివాసులు అనే వ్యక్తి పై ఆదే గ్రామానికి చెందిన కరువ పెద్దయ్య అనే వ్యక్తి రాళ్లతో దాడి చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలివీ.. గొల్ల శ్రీనివాసుల పొలం పైభాగంలో ఉండగా కురువ పెద్దయ్య పొలం కింది భాగంలో ఉంది. అయితే శ్రీనివాసుల పొలం పైభాగం నుంచి కిందభాగంలో ఉన్న కరువు పెద్దయ్య పొలంలోకి నీరు వచ్చినందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయంపై మాట్లాడుకుందామని కురువ పెద్దయ్య గొల్ల శ్రీనివాసులును దూరంగా పిలుచుకోపోయి రాళ్లతో దాడి చేశాడు. శ్రీనివాసులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో కోడిపందెంరాయుళ్లు

- 8 మంది అరెస్ట్, పరారీలో 13 మంది
- కోళ్లు, నగదు, బైక్‌ల స్వాధీనం

నంద్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దకొట్టాల-బొల్లవరం గ్రామాల మధ్యలో జరుగుతున్న కోడిపందేల స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడిచేశారు. కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ గంగయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్రమత్తమైన కోడి పందెంరాయుళ్లు బైక్‌లు, నగదు, కోళ్లను వదిలేసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పెద్దకొట్టాల, బొల్లవరం గ్రామాలకు చెందిన 8మందిని అదుపులోకి తీసుకోగా, మరో 13మంది పరారయ్యారు. సంఘటనా స్థలం నుంచి రెండు కోళ్లను, 10మోటార్ బైక్‌లను, రూ.10వేల నగదును స్వాధీనం చేసుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండు కోడిపుంజులలో ఒక పుంజు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పరారైన 13 మంది కోడిపందెం రాయుళ్ల కోసం రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పరారైన వారిలో కొందరు రాజకీయ పార్టీనాయకులు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జంట హత్య కేసులో నిందితుడికి రిమాండ్


నిందితుడిని జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

గడివేముల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామంలో 2021 సంవత్సరంలో జరిగిన జంట హత్య కేసులో నిందితుడికి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్‌మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నీసీ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వడ్డు ప్రతాప్ రెడ్డి, వడ్డు నాగేశ్వర్‌రెడ్డిలను 2021లో హత్య చేసిన కేసులో నిందితు డైన బండపల్లి రామమద్దిలేటి కోర్టు వాయిదాలకు గైర్హాజరవు తుండడంతో జుడిషియల్ ఫస్ట్‌క్లాస్‌మెజిస్ట్రేట్ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారన్నారు. నిందితుడిని కోర్టులో శుక్రవారం హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

నందవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో స్నేహ అనే విద్యార్థిని, ఆటో డ్రైవర్ వీరాచారికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివీ.. గంగవరం గ్రామానికి చెందిన విద్యార్థిని నాగలదిన్నె నుంచి గంగవరంకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అయితే జోహరాపురం గ్రామం దగ్గర ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న స్నేహ కాలికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ వీరాచారి తలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దొంగల అరెస్టు


దొంగల అరెస్టును చూపుతున్న పోలీసులు

మహానంది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో రైల్వే ఇనుప సామగ్రిని చోరీ చేసిన ఐదుగురు దొంగలను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గతనెల 31వ తేదిన గుర్తు తెలియని వ్యక్తులు గాజులపల్లి సమీపంలో రైల్వే డబుల్ లైన్ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసుకొన్న ఇనుప సామగ్రిని దొంలించారని సైట్ ఇంజనీర్ సుమంత్ కుమార్ ఫిర్యాదు చేశారు. గోపవరానికి చెందిన పిన్నాపురం తిరుమలేసు, నాగసరపు అశోక్, మాచర్ల ఆదికేశవ్, షేక్ సద్దాం హుస్సేన్, ఔకు శివను సీతారామపురం సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. నిందితుల నుంచి ఒకటిన్నర టన్ను ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నంద్యాల కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. మరో నిందితుడు గోపవరానికి చెందిన చెవుల విక్రమ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

శ్రీశైలం ఘాట్‌లో కారు దగ్ధం


అగ్నికి ఆహుతి అవుతున్న వాహనం

సున్నిపెంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఘాట్ రూట్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఓ కారు అగ్నికి ఆహుతి అయ్యింది. వివరాలివీ.. గుంటూరుకు చెందిన కొందరు భక్తులు శ్రీశైల దర్శనార్థం వస్తున్నారు. దోర్నాల-శ్రీశైలం ఘాట్ రూట్ మధ్య చిన్నారుట్ల గిరిజన గ్రామం వద్దకు రాగానే కారు ఇంజన్‌లో పొగలు రావడాన్ని భక్తులు గమనించారు. ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన భక్తులు ప్రాణ భయంతో అప్రమత్తమై కారు నుంచి బయట పడ్డారు. కారు ఇంజన్‌లోని బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అందరూ చూస్తుండగానే వాహనం పూర్తిగా కాలిపోయింది.

తండ్రీకొడుకులపై హత్యాయత్నం

బేతంచెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కురువ మద్దయ్య తండ్రి సుబ్బరాయుడునను ఒక వ్యక్తి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. రంగాపురం గ్రామానికి చెందిన కురువ మద్దయ్య, తండ్రి సుబ్బరాయుడును వారి ఇంటి వద్దకు వెళ్లి అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి పాతకక్షలు మనసులో పెట్టుకుని కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. మద్దయ్య ఫిర్యాదు మేరకు ప్రసాద్‌రెడ్డిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

కోసిగి ప్రభుత్వాసుపత్రిలో బాలింత మృతి

- కాన్పు అయిన పది నిమిషాలకే విషాదం


నాగేంద్రమ్మ (ఫైల్)

కోసిగి, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత బి.నాగేంద్రమ్మ మగ శిశువుకు జన్మనిచ్చిన కొడుకును చూడకుండా మృతి చెందిన ఘటన కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కోసిగి మండలంలోని డి.బెళగల్ పంచాయతీలోని దొడ్డి గ్రామానికి చెందిన నరసన్న, నరసింగమ్మ దంపతుల చిన్న కుమార్తె నాగేంద్రమ్మను ఆదోని మండలం సంతెకుల్లూరు గ్రామానికి చెందిన హెబ్బటం రమేష్‌కు ఏడాది క్రితం నాగేంద్రమ్మను ఇచ్చి వివాహం చేశారు. అయితే నాగేంద్రమ్మ శుక్రవారం కాన్పు కోసం కోసిగి ఆసుపత్రికి తీసుకురాగా, కాన్పు చేసిన స్టాఫ్ నర్సు విద్యావతి కాన్పు మధ్యలోనే బాలింత నాగేంద్రమ్మకు ఫిట్స్ రావడంతో కడుపులో ఉన్న మగశిశువును సురక్షితంగా బయటకు తీసిన కొద్ది క్షణాల్లోపే బాలింత నాగేంద్ర మ్మ మృతి చెందినట్లు స్టాఫ్ నర్సు విద్యావతి తెలిపారు. మొదటి కాన్పులోనే తమ కూతురు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చి కొడుకును చూడకుండానే తిరిగి రాని లోకాలకు వెళ్లిందని మృతురాలి తల్లిదండ్రులు నరసన్న, నరసింగమ్మ రోదించారు.

ఆమె భర్త స్వగ్రామమైన ఆదోని మండలం సంతకుల్లూరు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. శిశువును మెరుగైన వైద్య చికిత్స కోసం ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిట్స్‌తో బాలింత మృతి చెందిందని చెప్పారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

నర్సుల సమస్యలు పరిష్కరించాలి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ హంస నాయకులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ హంస యూనియన్ నాయకులు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. అత్యవసర విభాగాల్లో నర్సింగ్ సిబ్బందికి వాష్ రూంలు లేవని, కొన్ని వార్డుల్లో యూనిఫాం మార్చుకోవడానికి గదులు లేక ఇబ్బంది పడుతున్నారని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరేట్ పక్కన ఉన్న గవర్నమెంటు స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, అక్కడ వార్డన్, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు బి.రఘుబాబు, కర్నూ లు సిటీ అధ్యక్షుడు టి.గోవిందుస్వామి, స్టేట్ మహిళా వింగ్ సెక్రటరీ డి.మంజుల దేవి, సిటీ సెక్రటరీ చక్రి, జాయింట్ సెక్రటరీ ఎం.లీలమ్మ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సుపై ఫేక్ కాల్స్ నమ్మొద్దు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌కు సంబంధించి ట్రేడ్ లైసెన్సు రుసుములను చెల్లించాలని కొందరు అజ్ఞాత వ్యక్తులు వాణిజ్య దుకాణదారులకు ఫేక్ కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటివి నమ్మొద్దని కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నగరంలో వాణిజ్య దుకాణదారులు శానిటేషన్ ఇన్స్‌పెక్టర్, సెక్రటరీ, మేస్త్రీల ద్వారా మాత్రమే ట్రేడ్ లైసెన్సు రుసుములు చెల్లించి రశీదు పొందాలన్నారు. 916304326727 నెంబర్ లేదా ఇతర ఏ నెంబర్‌తోనైనా అజ్ఞాత వ్యక్తులు కాల్ చేసి తాము మున్సిపల్ అధికారులమని చెబితే దానిని నమ్మొద్దన్నారు. తొందరపడి ఫోన్‌పే, గూగుల్‌పే వంటి లావాదేవీలు సైతం చేయవద్దన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలకు దిగుతామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రమా ణ స్వీకారం చేయగానే మొదటి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి ఇప్పటికి 9 నెలలు గడిచిన నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. నోటిఫికేషన్ విడుదలలో కావాలనే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయాలని లేనిపక్షంలో ఈ నెల 8 నుంచి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్య క్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

కనీస వేతనాలు సవరించాలి: సీఐటీయూ


మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కార్మికుల కనీస వేతనాలు సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఏపీ ప్రభుత్వ కార్మిక, కార్మాగార, బాయిలర్స్, బీమా, మెడికల్ సర్వీసెస్ అడిషనల్ కార్యదర్శి గంధం చంద్రుడుతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కనీస వేతనాలు సవరించి 15 సంవత్సరాలు అవుతుందన్నారు. కనీస వేతనాలు సవరించి జీవోను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు ఫ్యాక్టరీల తరఫున నాయకులు తమ సమస్యలను వివరిం చారు. ఈ సమావేశంలో సీఐయూటీ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, కార్బైడ్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకుడు లక్ష్మన్న పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తాండ్రపాడు ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు శుక్రవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు పాలిసెట్ ప్రవేశ పరీక్షలో ఉచిత శిక్షణ ఇస్తామని ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తామన్నారు. పాలిసెట్‌లో అధిక మార్కులు సాధించడానికి అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. వివరాలకు 9059489437 నెంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్- 2025 విద్యాసంవత్సరానికి ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సు ఇన్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాంశాలను ఆయన వివరించారు. ఆర్చరీ అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హాకీ, జూడో, రోయింగ్, ఖో-ఖో, రోప్‌బాల్, టేబుల్‌టెన్నిస్, తైక్వాండో, వెయిట్‌లిఫ్టింగ్, ఫెన్సింగ్ కయాంకింగ్ క్యానోకింగ్, కబడ్డీ, ఉషూ, యోగా, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, లాన్ టెన్నిస్, వాలీబాల్, సైక్లింగ్ మే 6 నుంచి జూలై 2వ తేదీ వరకు కోర్సును నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారని డీఎస్‌డీవో భూపతిరావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 14వ తేదీలోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం Https://www.6wcc.nsnis.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేట కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకను పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 12.15 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఇ.మల్లికార్జున రెడ్డి, ఈవో టి. రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ఆకుపూజలు, కుంకుమార్చనలు, స్వామివారి సహస్రనామ పారాయణం ఉంటాయని, ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ధర్మకర్త మల్లికార్జున రెడ్డి తెలిపారు.

రేపు హోసూరులో అంకయ్య రామాయణ గానామృతం: కర్నూలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, నంది పురస్కార గ్రహీత గుర్రప్పశాల అంకయ్య ఆదివారం శ్రీరామనవమి వేడుక సందర్భంగా తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా హోసూరులో రామాయణ గానామృత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హోసూరు తాలుకా ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గుర్రప్పశాల అంకయ్య రామాయణంలోని విశేషాలను తన గానామృత ప్రదర్శన ద్వారా భక్తులకు తెలియజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

శివారు కాలనీల్లో సమస్యల తిష్ట

- ఇళ్లల్లోకి వస్తున్న విష పురుగులు
- ఖాళీ స్థలాలన్నీ ముళ్లకంపలతోనే..


సంపత్‌నగర్‌లో ఇళ్లపై వాలిన ముళ్ల కంపలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. బళ్లారి చౌరస్తా సంపత్‌నగర్ మొదటి వీధిలో ఖాళీ స్థలాల్లో ముళ్లకంపలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. వర్షాకా లంలో ఈ ముళ్ల కంపలో దాగి వున్న విష పురుగులు, పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో అర్ధరాత్రి ఇంటి నుంచి బయట కు రావాలంటే కాలనీవాసులు జంకుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాణ్యం ఎమ్మెల్యేగా ఉన్న కాటసాని రాంభూపాల్ రెడ్డి ఎన్నోసార్లు సంప త్‌నగర్ మొదటి వీధిలో ముళ్లకంపలను తొలగించాలని కాలనీవాసులు వేడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని స్పందించి ఇళ్లపై ఉన్న ముళ్ల కంపలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్, కాలనీ ఇన్‌చార్జిని ఆదేశించారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రావడంతో ఇప్పటి కైనా ముళ్లకంపలను తొలగించి విష పురుగుల నుంచి తమ ప్రాణాలను కాపాడాలని ఆ కాలనీవాసులు ఎమ్మెల్యే గౌరు చరితను మొర పెట్టుకుం టున్నారు. అదేవిధంగా ఇళ్లపై ఏర్పాటు చేసిన హైటెన్షన్ కరెంటు వైర్లను తొలగించాలని సంపత్‌నగర్, మురారినగర్, ఠాగూర్ నగర్, జం పాల శివయ్య నగర్, విఠల్ నగర్ తదితర కాలనీల ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. మురారినగర్‌లో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయడంతో రాత్రి సమయంలో వాహనాలు ఆ స్తంభానికి ఢీకొని ప్రమా దాలు జరుగుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గౌరు చరిత


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులో రూ.36.10 లక్షలతో 60వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసిందన్నారు. చంద్రబాబు హయాంలోనే విమానాశ్రయం, ఉక్కుపరిశ్రమ, డీఆర్‌డీవో, సోలార్ పార్కు వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశారన్నారు. ఓర్వకల్లులో తాగునీటి సమస్య లేకుండా నూతన వాటర్ ట్యాంకును నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమల, ఏఈ శ్రీనివాసులు, ఎస్ఐ సునీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు రాంభూ పాల్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అల్లాబాబు, ఏసేపు, రాజన్న, శ్రీనివాసులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● **ఆర్టీసీ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం:** ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండులో అపరిశుభ్రంగా ఉండటంతోపాటు గత ఏడు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో ఎమ్మెల్యే గౌరు చరిత ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండులో చెత్తాచెదారం ఉండడమే కాకుండా రాత్రివేళలో విద్యుత్ లేదని ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే బస్టాండును తనిఖీ చేసి పరిశీలించారు.

పొగాకును కొనుగోలు చేయండి: ఓర్వకల్లులోని ఐటీసీ కంపెనీలో ప్రతి రైతు పొగాకును తప్పనిసరిగా కొనుగోలు చేయాలని కంపెనీ యజమాన్యాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. రైతులు ఐటీసీ కంపెనీ వారు గిట్టు బాటు ధర కల్పించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆమె ఐటీసీ పొగాకును విక్రయిస్తున్న గోడౌన్ వద్దకు వెళ్లి రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని కంపెనీ యజమానితో మాట్లాడారు. తేమ శాతం ఉందని పొగాకును కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ఐసీడీఎస్ పీడీ నిర్మల


చైల్డ్ హెల్ప్‌లైన్ కరపత్రాలతో ఐసీడీఎస్ పీడీ నిర్మల తదితరులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని, వీటిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమల్లోకి తెచ్చిందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల తెలిపారు. మహిళ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీడీ నిర్మల మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నా యన్న సమచారం వచ్చినప్పుడు వీటిని ఆపడం కన్నా ముందుగా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ముందుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కిషోర బాలికల వివరాలు తెలుసుకుని ఎంత మంది స్కూల్స్, కాలేజీలకు వెళ్తున్నారా లేదా.. మధ్యలో మానేశారా..? సర్వే చేయాలన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్త యిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికా రి టి.శారద మాట్లా డుతూ జిల్లాల బాలల సమస్యలు ఎదురైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 108కి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కర్నూలు అర్బన్ సీడీపీవో, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పత్తి ఓబులయ్యకు అభినందన సభ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉగాది వేడుక సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర స్థాయి కళారత్న (హంస) పురస్కారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా అందు కున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, విద్వాన్ పత్తి ఓబులయ్యకు అభినందన సభ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ సోమశేఖర్, గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవి, సంగా ఆంజనేయులు, మహమ్మద్ మియా ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, గౌరవ అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, సినీ నిర్మాత బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, ప్రతిభ విద్యాసంస్థల డైరెక్టర్ అరుణాచలం రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్ర మంలో నగరం లోని నాటక, కళ, సాహిత్య, పౌర సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని, అలాగే సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌యూలో నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఏ నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ (హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ) భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రను వ్యతిరేకిస్తున్నామని ఐసా రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగరాజు అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి ఎస్ నాగార్జున ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులపై లాఠీ చార్జి, అరెస్టులు సిగ్గు చేటని, వర్సిటీ భూముల కోసం పోరాడిన వారిపై కేసులు ఎలా పెడతారని ప్రశ్నించారు. 400 ఎకరాల విద్యా భూమిని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వర్సిటీ నాయకులు సురేష్, సునీల్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటసాని పరామర్శ

ఓర్వకల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామంలో గుండె వైద్య చికిత్స చేయించుకున్న వైసీపీ కార్యకర్త చింతలపల్లి అజీజ్‌ఖాన్‌ను తన నివాసంలో శుక్రవారం పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంగన్న, నాగ తిరుపాలు, వెంకటేశ్వర్లు, దస్తగిరి ఉన్నారు.

కొత్తపేటలో యథావిధిగా తాగునీటి సరఫరా

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేట, మంగళగేరి ప్రాంతాలలో తాగునీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. గత నాలుగు రోజులుగా తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు శుక్రవారం ముగిసాయన్నారు. డీఈఈ మనోహర్‌రెడ్డి పర్యవేక్షణలో కార్పొరేషన్ సిబ్బంది తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండ చేశారని ఆయన తెలిపారు. అధికారులు చొరవతో సమస్య తీరిందని స్థానిక మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగి ఉన్న రైలులో చోరీ

వెల్దుర్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆగివున్న రైలులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాల మేరకు.. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్(12798) తిరుపతి నుంచి కాచిగూ డకు గురువారం సాయంత్రం బయలు దేరింది. శుక్రవారం మధ్యాహ్నం బోగోలు రైల్వేస్టేషన్‌లో క్రాసింగ్ పడడంతో రైలు నిలి పారు. దొంగలు రైలులో ప్రవేశించి ఇద్దరు మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కొని పరారయ్యారు. బాధితులు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


హాకీ క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు శుక్రవారం జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టుకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో హాకీ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే క్రీడా పాలసీ మూడు శాతాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 9 వరకు అన్నమయ్య జిల్లా ధర్మవరంలో జరిగే 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. క్రీడాదుస్తులను నాగరాజు స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఈసీ మెంబర్లు అరుణ్ రవికుమార్, వీరేష్ పాల్గొన్నారు.

వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయకండి

కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు


కాలువలో తొలగించిన వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు తమ గృహాల్లో, వాణిజ్య సముదాయాల్లో వెలువడే వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయవద్దని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. శుక్రవారం మునగాలపాడు, గాంధీనగర్, బంగారుపేట తదతర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించాఆరు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలు డ్రైనేజీల్లో వేయడంతో మురుగు వ్యవస్థకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్, గాజు వస్తువులు, మొబైల్ స్క్రీన్ గార్డులు వంటి వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయడం వల్ల అవి కింది భాగంలో పేరుకుపోయి దోమలు, ఇతర క్రిమి కీటకాలు పెరిగి వ్యాధులు వ్యాప్తిచెందు తాయన్నారు. వర్షా లు పడినప్పుడు మురుగునీరు ఇళ్లలోకి చేరుతాయని, ఆ దుర్వాసనతో పురిసరాల ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. కార్యక్రమంలో ప్రజాఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగ రాజు, డీఈఈలు గిరిరాజు, మనోహర్‌రెడ్డి, ట్రైనీ ఏఈ ఖాసిం, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు వలి, జిలానీ, లోకేష్ పాల్గొన్నారు.

11 నుంచి సుంకులా పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు



గూడూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో సుంకులాపరమేశ్వరి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బీవీ నరసయ్య తెలిపారు. ఈనెల 11న గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, అంకురార్పణ, మండపరాధన, రాత్రి 8గంటలకు ప్రభోత్సవం, 12న నిత్యపూజలు, రథాంగ హోమం, శిఖర పూజలు, సాయంత్రం 5గంటలకు దివ్యమంగళ రథోత్సవం, 13న నిత్యపూజలు, మండపారాధన, ఉద్వాసన, సాయంత్రం 4గంటలకు లింగమన్న పూజ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

పేద మహిళలకు ఉల్లిగడ్డల పంపిణీ


ఉల్లిగడ్డలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం సెక్రటరీ చిన్నయ్య సహకారంతో నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో గురువారం పేద మహిళలకు ఉచితంగా ఉల్లిగడ్డలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి నిఖిలేష్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మద్దిలేటి, రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత హాజరై మాట్లాడారు.

చినుకు పడితే చిత్తడే..


రోడ్డు నిలిచిన వర్షం నీరు

సి.బెళగల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమ యాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొదలుకొని పలుకుదొడ్డి క్రాస్ రోడ్డు వరకు రోడ్డుపై నీరు నిలిచింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

మహిళల ఆత్మగౌరవం పెంచడమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మగౌరవం పెంచడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం మండలం లోని కాల్వ గ్రామంలో మండల సమైఖ్య గౌరవ సలహాదారాలు విజయ భారతి ఆధ్వర్యంలో మగ్గం వర్క్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయభారతి మాట్లాడుతూ మొదటి విడతగా 20 మంది మహిళలకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడేందుకు మగ్గం శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విజయభారతిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం వెంకట్రా మిరెడ్డి, ఎస్ఐ సునీల్ కుమార్, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, రజాక్ బాషా, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

గుండె పోటుతో రైతు మృతి


వెంకటేష్(ఫైల్)

సి.బెళగల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామానికి చెందిన పచ్చర్ల వెంకటేష్ (65) అనే రైతు శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. వెంకటేష్ తనకు ఉన్న ఎకరా పొలంతోపాటు మరొక 6 ఎకరాలు కౌలుకు తీసుకుని ఉల్లి, మిరప, వేరుశెనగ, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేశాయి. అయితే పంటలకు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడంతో నిత్యం మధనపడేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆకస్మాత్తుగా గుండెపోటుతో ఆయన మృతి చెందాడు. ఈయనకు భార్య సుంకులమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు వెంకటేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఈరన్నగౌడు, రవి, టీడీపీ కార్యకర్తలు రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

సి.బెళగల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ రవీంద్రరెడ్డి, జేఈ విజయభాస్కర్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఈ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మండ లానికి మొదటి ఫెస్‌లో కొండాపురం, ఇనగండ్ల, కంబంధహల్, సిబెళగల్ గ్రామాలలో దాదాపు రూ.కోటితో నిర్మించిన సీసీరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించామన్నారు. ఆయన వెంట ఏఈ వెంకట ప్రకాశ్, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేయండి

- ఆర్డీవోకు మద్దికెర వార్డు మెంబర్ల ప్రతిపాదన

పత్తికొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ప్రమీలమ్మపై అవిశ్వాస తీర్మానం ఏర్పాటు చేయాలంటూ వార్డు మెంబర్లు శుక్రవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు పత్రిపాదన పత్రాన్ని ఇచ్చారు. స్పందించిన ఆర్డీవో అధికారులకు ఆదేశాలు జారీచేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వార్డు మెంబర్లు కవిరెడ్డి క్రిష్ణ, బాలక్రిష్ణ, కమతం సుశీల, డి.హనుమంతమ్మ తదితరులు ఉన్నారు.

మద్దికెరలో వర్షం



వర్షంలోనే సంత మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న ప్రజలు

మద్దికెర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎండలతో అల్లాడిపోయిన ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షంతో ఉపశమనం కలిగింది. ప్రతి శుక్రవారం సంత నిర్వహించడం ఆనవాయితీ. దీంతో ప్రజలు వర్షలో తడుస్తూనే కొనుగోళ్లు చేశారు.

ముళ్ల కంపను తొలగించండి

ఆలూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి-జొహరాపురం రహదారిలో ఇరువైపులా ఉన్న ముళ్ళ కంపను తొలగించాలని విద్యా కమిటీ ఛైర్మన్ సురేష్ వార్డు సభ్యుడు జలంధర్ యాదవ్ కోరారు. శుక్రవారం మొలగవల్లిలో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని, అధికారులు స్పందించి కంపను తొలగించాలని కోరారు.



కంపను చూపుతున్న స్థానికులు

ఉపాధ్యాయులను గౌరవించాలి

మద్దికెర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. శుక్రవారం మద్దికెర గ్రామంలోని వశిష్ట ప్రైవేటు పాఠశాల, హంపా ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కోరారు. వశిష్ట పాఠశాల ప్రిన్సిపల్ కోలి పక్కీరప్ప, హంపా హెచ్‌ఎం ఎంజీ నాగరాజు, లీలావతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన కారు



ప్రమాదానికి కారణమైన కారు

ఆదోని రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాదాపురం శివార్లలో ఆటోను కారు ఈ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. శుక్రవారం ఆస్పరి మండలం అటికెల గుండుకు చెందిన కుటుంబ సభ్యులు ఆదోని నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళతున్నారు. కర్ణాటకకు చెందిన కారు వేగంగా ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న రామచంద్ర, పార్వతితోపాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తాలుక ఎస్.ఐ రామాంజనేయులు క్షతగాత్రులను ఏరియాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ఆదోని టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన స్వయంగా వార్డుల్లో తిరుగుతూ పనులను పర్యవేక్షించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా శ్రద్ధగా పని చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్త పేరుకుపోకుండా డంప్ యార్డుకు తరలించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ప్రజలు చెత్తను కాలువలో వేయకుండా సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు.

చెత్తను వీధుల్లో వేయవద్దు



బొందిమడుగులలో చెత్తబుట్టలను ఇస్తున్న సర్పంచ్

తుగ్గలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చెత్తను వీధుల్లో వేయకుండా తడి, చెత్తను బుట్టలలో ఉంచి, పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని సర్పంచ్ చౌడప్ప, పంచాయతీ సలహాదారుడు ప్రతాప్ యాదవ్ కోరారు. శుక్రవారం మండలంలోని బొందిమడుగులలో ప్రజలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. చెత్తను సంపద కేంద్రాలకు తరలించి సేంద్రీయ ఎరువులను తయారు చేసి తక్కువ ధరకే రైతులకు అందిస్తారన్నారు టీడీపీ నాయకులు దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి చిన్న తిప్పన్న తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్ల దోపిడీని అరికట్టాలి

ఆలూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల దోపిడీని అరికట్టాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి షేకున్‌బీ డిమాండ్ చేశారు. శుక్రవారం జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని ఓ డీలర్ కార్డుకు 5 కేజీల బియ్యాన్ని తక్కువగా వేస్తున్నారన్నార ఆరోపించారు. అరికట్టకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతూన్న షేకున్ బీ

తాగునీటి గండం

- ఆదోనిలో మూడురోజుల కోసారి తాగునీరు
- ఎస్ఎస్ ట్యాంకు గట్లకు పగుళ్లు
- కొంతవరకే నింపిన అధికారులు



బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నిలువ ఉన్న నీరు

ఆదోని టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఇబ్బందులు తప్పవేమోనని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణానికి తాగునీటి సరఫరా చేసే బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నీటి నిల్వ పూర్తి స్థాయిలో లేకపోవడమే ఇందుకు కారణం.

శివారు ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు

పట్టణ శివారు ప్రాంతాల్లో అప్పుడే తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. వైఎస్సార్ నగర్, భీమ్‌రెడ్డి కాలనీ, లక్ష్మమ్మ నగర్, కోట్ల కాలనీ, మోనార్టీ కాలనీ, రాయనగర్ తదితర ప్రాంతాల్లో ఇబ్బందులు ఉన్నాయి. దీంతో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు అధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. మున్సిపాలిటీకి ఒక ట్యాంకర్ మాత్రమే ఉండటంతో ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. వేసవిలో తాగునీటి ఇబ్బందులు అధిగమిం చడానికి అధికారులు రు.1.15కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొత్త బోర్లు వేయడానికి, పాత వాటికి మరమ్మతులు, ఫ్లషింగ్ చేయడానికి, లీకేజీల మరమ్మ తులు, ట్యాంకర్లతో శివారు ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ప్రాంతాలవారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు.

రాంజలకు నీటి పంపింగ్

బసాపురం ఎస్ఎస్ ట్యాంకుతో పాటు, పురాతన రాంజల చెరువును కూడా నింపేందుకు ఎల్ఎల్‌సీ నుంచి మోటార్లతో నీటిని పంపింగ్ చేస్తున్నారు. 3,110 మిలియన్ లీర్ల సామర్థ్యం ఉన్న బసాపురం చెరువులో 1,800 మిలియన్ లీటర్ల నీరు మాత్రమే నిల్వ ఉంది. అలాగే 1,210 మిలియన్ లీటర్ల సామర్థ్యం ఉన్న రాంజల చెరువులో 800 నీరు మాత్రమే నిలువ ఉంది. ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే కెనాల్‌లో నీరు వచ్చే అవకాశం ఉంది.

ఎస్ఎస్ ట్యాంక్ గట్లకు పగుళ్లు

ఎస్ఎస్ ట్యాంకు గట్టుకు మూడేళ్ళ క్రితం పగుళ్ళు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి చెరువును పూర్తి స్థాయిలో నింపుకొనే అవకాశం లేకుండా పోయింది. అధికారులు మరమ్మతులు చేయించకుండా వదిలేశారు. ఇదే స్థితిలో చెరువును పూర్తిగా నింపితే గట్టు తెగే ప్రమాదం ఉంది.



తాగునీటి ఇబ్బందులు రానివ్వం



ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రస్తుతం మూడు రోజులకోసారి తాగు నీటిని సరఫరా చేస్తున్నాం. రాంజల చెరువును కూడా నీటితో నింతున్నాం. ఇప్పుడున్న నీటితో పట్టణ ప్రజలకు 90 రోజుల వరకు తాగునీటిని అందించే అవకాశం ఉంది.

- కృష్ణ, మునిసిపల్ కమిషనర్

టీడీపీ కార్యకర్తలపై ఎందుకు దాడులు చేస్తున్నారు

- కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప



ఆదోని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలపై ఎందుకు దాడులు చేస్తున్నారని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ఎమ్మెల్యే పార్థసారథిని ప్రశ్నించారు. శుక్రవారం మాట్లాడుతూ ఎల్లెల్సీ నీటి విషయంలో రైతుల మధ్య ఘర్షణ చోటుచేసుకుందన్నారు. ఇరువర్గాల వారు కూడా కూటమికి చెందిన వారే అన్నారు. అయితే ఎమ్మెల్యే పార్థసారథి బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తే కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇరుపక్షాలను పిలిపించి మాట్లాడకుండా, తమరి గెలుపు కోసం కృషి చేసిన వారిపై కేసులు పెట్టించడం సమంజం కాదన్నారు.

6న కల్యాణం

ఆలూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న శ్రీరామ నవమి సందర్భంగా బెళ్లిగుండు ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ముద్దనగేరి, కమ్మరచేడు, హత్తిబెళగల్ గ్రామాల్లో కూడా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

డ్రాపౌట్స్‌ను తగ్గించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం కార్యాలయంలో విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ వెల్ఫేర్, కెజీబీవీ హాస్టల్ అధికారులతో సమక్షా సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను మండల విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎల్పీవో నూర్జహాన్, డిప్యూటీ డీఈవో వెంకటరమణ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజ కుళ్ళాయప్ప పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

మద్దికెర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందలంటే పీ-4 సర్వేకు సహకరించాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ కోరారు. శుక్రవారం మండలంలోని హంపా, పెరవలి గ్రామాల్లో సర్వేను తనిఖీ చేశారు. ఈ సర్వేలో కుటుంబ వివరాలు, ఆరోగ్యంపై సర్వే చేస్తారని, ప్రజలు సహకరించకపోతే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం కష్టమవుతుందన్నారు. వీఆర్వో రంగస్వామి, తదితరులు ఉన్నారు.

పిడుగులు పడే ప్రమాదం..

మండలంలో పిడుగులు పడే ప్రమాదముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని, వర్షం కురిసే సమయంలో చెట్లు, సెల్‌ఫోన్ టవర్స్ పోల్స్ పొలాలు బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని, భవనాల్లో, సురక్షితమైన ప్రదేశాల్లో ఉండాలని సూచించారు.

మురుగును తొలగించారు



మురుగును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధి కాలువలో పేరుకుపోయిన మురుగును శుక్రవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మురుగు పారక' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించినా పంచాయతీ అధికారులు డ్రైనేజీని శుభ్రం చేశారు. కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న సమత సైనిక్ దళ్ ప్రతినిధి రంగయ్య

ఆలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరకట్టు గ్రామం ఉగాది వేడుకల్లో దళితులపై దాడికి పాల్పడిన బోయసురేష్, బోయశీను, బోయపురుషోత్తం, బోయ శ్రీనివాసులుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని సమత సైనిక్‌దళ్ అధికార ప్రతినిధి రంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మరకట్టు గ్రామంలో బాధితులను పరామర్శించారు. ఉద్దేశపూర్వకంగానే కడగంటి మాల లక్ష్మి భీమలింగ, కడగంటి లక్ష్మన్న, మాల ఎల్లప్పపై దాడిచేశారన్నారు. అయితే పోలీసులు బాధితులైన దళితులపైనే కౌంటర్ కేసులు పెట్టడం పోలీసులకు సరికాదన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మాల మహానాడు నాయకులు ఈరన్న, పెద్దక్క, మంగమ్మ, దొంతిరాగప్ప, పెద్ద వెంకోబు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో జరుపుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలస్వామి, అధ్యాపకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశార న్నారు. అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, వెంకట్రాం రెడ్డి, గోపాల్ రెడ్డి, ఎల్లప్ప, విరుపాక్షి, నిఖిల్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి

మద్దికెర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని మద్దికెరలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పాస్టర్లు, క్రైస్తవులు బస్టాండు వద్ద మానవహారం నిర్మించారు. పాస్టర్లు ఆంథోని, జయన్న, సంజన్న, ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని కోరారు. క్రైస్తవులపై దాడులు జరగకుండా అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. పాస్టర్లు యేసురత్నం, ప్రతాప్, రాజశేఖర్, ఆనందరాజు, ఇజ్రాయేల్, సామేల్, రవి, ఆల్‌బర్ట్ ఉన్నారు.



మద్దికెరలో పాస్టర్ల ర్యాలీ

కర్ణాటక మద్యాన్ని నియంత్రించండి



ఎస్పీతో లక్ష్మీనారాయణ

ఆలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో కర్ణాటక మద్యం సరఫరాను నియంత్రించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కోరినట్లు ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం కర్నూలులో ఎస్పీని కలిశానని హొళగుంద, హాలహర్వి చెక్‌పోస్ట్‌పై నిఘా పెంచాలన్నారు. చిప్పగిరిలో క్వార్టర్స్ లేకపోవడంతో పోలీసులు గుంతకల్లులో ఉంటారని రాత్రిళ్లు ఏమైనా జరిగితే పోలీసులు అందుబాటులో ఉండరన్నారు.

అన్నదానం

ఆదోని టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువ నాయకుడు మారుతి నాయుడు జన్మదినం సందర్భంగా శక్రవారం అన్నదానం చేశారు. మండిగిరి టీడీపీ ఇన్‌చార్జీ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్‌లో డబ్బులు చెల్లించి పేదలకు ఉచితంగా భోజనం అందించారు.

అవగాహన ఉండాలి

తుగ్గలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమాజంపై అవగాహన ఉండాలని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున సూచించారు. శుక్రవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలపై 9121101133 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆగి ఉన్న రైలులో చోరీ

వెల్దుర్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆగివున్న రైలులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాల మేరకు.. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్(12798) తిరుపతి నుంచి కాచిగూడకు గురువారం సాయంత్రం బయలు దేరింది. శుక్రవారం మధ్యాహ్నం బోగోలు రైల్వేస్టేషన్‌లో క్రాసింగ్ పడడంతో రైలు నిలిపారు. దొంగలు రైలులో ప్రవేశించి ఇద్దరు మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కొని పరారయ్యారు. బాధితులు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కోట్ల సుజాతమ్మ జన్మదిన వేడుకలు

ఆలూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని కోట్ల కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బోయ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి : డీఎల్పీవో



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎల్పీవో, కార్యదర్శులు

ఆదోని రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అన్ని గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని డీఎల్పీవో నూర్జహాన్ సూచించారు. శుక్రవారం మండిగిరి, సాదాపురం పంచాయతీల పరిధిలో సాదాపురం టీడీపీ నాయకుడు రాజశేఖర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కార్యదర్శులు చంద్రశేఖర్, సురేష్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. పాదచారులు, వాహనదారులు, ప్రయాణీకుల కోసం బస్టాండు, రద్దీ ప్రాంతాల్లో సర్పంచుల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.

మురిపించిన మునగ

- ఎకరాకు రూ.లక్ష ఆదాయం



సాగుచేసిన మునగ, ఇన్‌సెట్‌లో రైతు నాగేష్

దేవనకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సాధారణ పంటల సాగుతో నష్టపోయిన ఓ రైతు మునగ సాగు చేశారు. అయితే లాభాల పంట పండించింది. వివరాలు.. మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన రైతు ఎర్రబాటి నాగేష్ ఎకరా భూమిలో ఉల్లి సాగుచేసి, అంతర పంటగా మునగ మొక్కలు నాటాడు. ఉల్లి కోత ముగిశాక మునగ కోత మొదలైంది. రూ.20వేలు పెట్టుబడి పెట్టగా రూ.లక్ష ఆదాయం వచ్చిన్న ట్లు రైతు తెలిపారు. మార్కెట్లో మునగ కాడల ధర కిలో రూ.50లు పలుకుతుందని, స్థానికంగా అమ్మగా, మిగిలిన సరుకును ఆదోని మార్కెట్‌కు పంపతున్నట్లు తెలిపారు. మునగ కోతకు కూలీల ఖర్చు కుడా తక్కువేనని, కుటుంబ సభ్యులతోనే కోసినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు ఫైర్ ఆఫీసర్ ఖాద్రి



ఆలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆలూరు అగ్నిమాపక అధికారి ఖాద్రి తెలిపారు.

ప్రశ్న: ఆలూరు అగ్ని మాపక క్రేందం పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి, సిబ్బంది ఎంతమంది ఉన్నారు.?

జవాబు: ఆలూరు, చిప్పగిరి, హలహర్వి, హొళగుంద మండలాలు ఉన్నాయి. ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు ఉన్నారు. 9 మంది ఫైర్‌మెన్లకు గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు.

ప్రశ్న: ఈ ఏడాది ఇప్పటివరకు ఎన్ని అగ్ని ప్రమాదాలు సంభవించాయి?

జవాబు: 56 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గడ్డివాములు, ఇతరత్ర చిన్నచిన్న ప్రమాదాలే.

ప్రశ్న: ప్రమాదంలో మంటలను ఎలా ఎలా అదుపు చేస్తారు?

జవాబు: అగ్ని ప్రమాదాలకు మొదటి కారణం మండే పదార్థం, రెండోది నిప్పు, మూడు గాలి. ఈ మూడింటిలో ఏదో ఒకదాన్ని నిర్వీర్యం చేస్తేనే మంటలను అదుపు చేయగలం. గాలిని నివారించలేం కాబట్టి నిప్పును అదుపు చేసేందుకు ప్రయత్నిస్తాం.

ప్రశ్న: ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

జవాబు: ఏటా ఏప్రిల్ 15 నుంచి వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు ద్ృశ్యరూపకంగా వివరిస్తున్నాం. సాధారణ సమయాల్లో పాఠశాలల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: ప్రమాదాల నివారణకు మీరిచ్చే సూచనలు?

జవాబు: గ్యాస్ సిలిండర్ల వినియోగంపై మహిళలు, పురుషులు అవగాహన కలిగి ఉండాలి. ప్రమాద తీవ్రత పెరగకముందే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలి. ప్రమా దాన్ని నివారించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించాలి. స్థానికులు బాధిత కుటుంబానికి సాయం అందించేందుకు ప్రయత్నించాలి. అగ్ని ప్రమాదాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 101, ఆలూరు ఫైర్ స్టేషన్ నంబర్ 08523229088కు సమాచారం ఇవ్వాలి.

ప్రశ్న: పాఠశాలలు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్, పెట్రోల్ బంక్, బ్యాంకుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు మిషన్లు అందుబాటులో ఉన్నాయా?

జవాబు: మూడేళ్లకు ఒకసారి వీరందరు రెన్యువల్ చేసుకోవాలి. అగ్ని ప్రమాదాలు జరిగితే అదుపు చేసేందుకు మిషన్లు ఏర్పాటు చేసుకునేలా చూస్తున్నాం.

వెండి గజవాహనంపై ప్రహ్లదరాయలు



వెండి గజవాహనంపై విహరిస్తున్న ప్రహ్లదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లదరాయలు వెండి గజవాహనంపై విహరించారు. చైత్రమాస సప్తమి శుక్రవారం శుభదినం పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామి వారికి ఊంజలసేవ నిర్వహించారు. పీఠాధిపతి భక్తులను ఆశీర్వదించారు.

శ్రీమఠం అభివృద్ధికి విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన ప్రసన్న రామచంద్ర అనేభక్తుడు రూ.5లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జ్యోషి, సురేష్ కొణాపూర్ తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని శ్రీమఠం అభివృద్ధి పనులకు రూ.5లక్షల చెక్‌ను విరాళం ఇచ్చారు. అదేవిధంగా మంత్రాలయం కెనరా బ్యాంకు రూ.10 లక్షలు విలువ చేసే బొలేరో గూడ్స్ వాహనం, బెంగళూరుకు చెందిన ఎంపీపీ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ సంస్థ మేనేజర్ శ్రీనివాసరావు రూ.6.50 లక్షలు విలువ చేసే టాటా-ఏసీ గూడ్స్ వాహనం విరాళంగా ఇచ్చారు. వీటికి శ్రీమఠం పీఠాధిపతి పూజలు చేసి హారతులు ఇచ్చి ప్రాంభించారు. దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్ర స్వామి మెమెంటోతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్టోర్ ఇన్‌చార్జి రాఘవేంద్రరావు, ఐటీ సెక్షన్ లక్ష్మీకాంత్ ఆచార్, అనంతపు రాణిక్, శ్రీపాధాచార్, గిరిధర్, సుజ్ఞానేంద్ర ఆచార్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

కౌతాళం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడల్లో క్రీడాస్ఫూర్తి చాటాలని జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మన్న, టీడీపీ బదినేహల్ నాయకుడు నరసింహులు అన్నారు. మండల పరిధిలోని బదినేహల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, రమేష్, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ షేక్షావలి, పీఈటీ నరసింహరాజు, ఉపాధ్యాయులు శేషాద్రి పాల్గొన్నారు.

గ్రామ సభలకు హాజరు కావాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గీతా ప్రియదర్శిని

పెద్దకడుబూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రీ సర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు నిర్వహించే గ్రామ సభలకు రైతులు తప్పక హాజరు కావాలని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే సమయంలో రైతులు తమ పొలాల దగ్గర ఉండాలన్నారు. తమ పొలంగట్ల వివరాలను రీ సర్వే అధికారులకు తెలియజేసి హద్దులను గుర్తించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ సభలకు హాజరై మీ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. రైతులు గ్రామ సభలకు హాజరు కాకపోతే మీ సమస్యలు పరిష్కారం కావన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ లలితకుమారి, వీఆర్వో ఆదెప్ప, సర్వేయర్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు నరసింహులు, మానప్ప, నాగేష్, వీరేష్, బసప్పలు పాల్గొన్నారు.

అకాల వర్షం... అపార నష్టం



నేలకు ఒరిగిన వరి పంట

కౌతాళం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులకు అపార నష్టం కలిగింది. ముఖ్యంగా మండల పరిధిలోని వల్లూరు, గుడికంబాలి, నదిచాగి గ్రామాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలపాలైనది. ప్రభుత్వం రైతులకు జరిగిన నష్టానికి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

హెచ్.కైరవాడిలో దశావతర విగ్రహ ప్రతిష్ఠ

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్‌కైరవాడి గ్రామంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు దశావతార విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు మహాగణపతి పూజ, సాయంత్రం హోమ బలిహరణ, నూతన విగ్రహాలకు అభిషేకం, నైవేద్యం, హారతి, ఆదివారం ఉదయం 6గంటలకు హోమం, పూర్ణాహుతి, పూర్ణ కళాశాభిషేకం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం, పూజ మంగళహారతి ఉంటుందని తెలిపారు. అనంతరం వేద పండితులచే ప్రవచనాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మూడు మండలాల్లో ఎక్కడెక్కడ, ఏఏ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ కూడా ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్లు, ట్యాంకులు మరమ్మతులు ఉంటే వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు బంగారమ్మ, మనోరంజని, పుల్లయ్య ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

● **సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే:** ఎమ్మిగనూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కలిశారు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో తాగునీటి సమస్యపై సమీక్షించారు. అంతకు ముందు సబ్ కలెక్టర్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీఎల్‌పీవో నూర్జహాన్, తహసీల్దార్ శేషఫణి, శ్రీనివాసులు, కుమారస్వామి, కమిషనర్ గంగిరెడ్డి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి బరితెగింపు

- రోడ్డును ఆక్రమించి హోటల్ ఏర్పాటు
- మృతదేహంతో ధర్నాకు దిగిన దళితులు
- గౌడుగల్లు గ్రామంలో ఘటన



మృతదేహంతో రోడ్డుపైనే నిరసన తెలుపుతున్న దళితులు

కోసిగి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన వైసీపీ నాయకుల్లో ఇంకా మార్పు రావడం లేదు. గత ఐదేళ్లలో అక్రమాలు, దౌర్జన్యాలు చేసిన వైసీపీ నాయకులు టీడీపీ ప్రభుత్వంలో కూడా బరితెగించి శ్మశానికి వెళ్లే రోడ్డును ఆక్రమించుకొని హోటల్ ఏర్పాటు చేసుకున్నాడు. దాంతో దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైసీపీ నాయకుడి ఇంటి వద్ద మృతదేహంతో శుక్రవారం ధర్నాకు దిగారు. మండల పరిధిలోని గౌడుగల్లు గ్రామంలో దళిత సామాజికవర్గంలో ఓ దివ్యాం గుడు మృతి చెందాడు. అంత్యక్రియలు వెళ్లే రహదారిలో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కుమ్మరి చంద్ర, గ్రామ సర్పంచ్ సహకా రంతో శ్మశానికి వెళ్లే దానిని ఆక్రమించుకొని హోటల్ ఏర్పాటు చేసుకు న్నాడు. దాంతో దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైసీపీ నాయకుడి ఇంటి ముందు ధర్నాకు దిగారు. గతంలో కూడా అధికారులకు ఫిర్యాదు చేసినా కూడా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు కూడా ఇరుకుగా ఉండటంతో శవాన్ని తీసుకెళ్లలేక ఇబ్బందులు పడుతు న్నామని వాపోయారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న హోటల్‌ను తొలగిం చాలని కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న ఇరిగేషన్ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ఆదుకోవాలని ఇరిగేషన్ వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఇరిగేషన్ వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుధాకర్, రామకృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 12,13 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్న సీఐటీయూ వర్క్ షాప్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రాజు, శ్రీను, యు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

మంత్రాలయం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో బాగంగా శుక్రవారం రాత్రి కర్ణాటకలోని గంగావతి సమీపంలో అనుగొందికి బయలుదేరి వెళ్లారు. శనివారం జరిగే రాఘవేంద్రస్వామి గురువులైన శ్రీమఠం పూర్వపు పీఠాధిపతులు కవీంద్ర తీర్థుల పూర్వారాధన, ఆదివారం మధ్యరాధన మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్కడే శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మూల రాములకు మహాభిషేకం నిర్వహించి భక్తులను ఆశీర్వాదించనున్నారు. పర్యటన ముగించుకొని సోమవారం మంత్రాలయానికి చేరుకుంటారని ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు.

వైసీపీ పట్టణ కమిటీ నియామకం

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పట్టణ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షుడిగా కొటకొండ నరసింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శిగా మాల విశ్వనాథ్, కార్యదర్శిగా జెరుబండి రఘువీర ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పని చేసిన వారికి గుర్తింపు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



బీద రవిచంద్రకు పూలబొకే అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపునిచ్చేది ఒక్క తెలుగుదేశం పార్టీయే నని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువ, రాఘవేంద్రస్వామి మెమెంటో, ప్రసాదం ఇచ్చి సన్మానం చేశారు. అనంతరం మంత్రాలయం నియోజకవర్గంలో వలసల నివారణకు, అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈకేవైసీ కోసం ఇక్కట్లు..

- ఉదయం 11 గంటలైనా తెరుచుకోని సచివాలయం-4
- లబ్ధిదారుల పడిగాపులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



గ్రామ సచివాలయం-4 ఎదుట ఈకేవైసీ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

కోసిగి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులోని లబ్ధిదారులు ఈకేవైసీ పెండింగ్ ఉండటంతో ఆధార్ అప్‌డేట్ కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కోసిగిలోని గ్రామ సచివా లయం-4లో ఆధార్ కేంద్రానికి కోసిగితో పాటు ఆయా గ్రామాల ప్రజలు సచివాలయాలకు పోటెత్తారు. సమయానికి సచివాలయం తెరవకపోవడంతో రోడ్డుపైన పిల్లలతో కలిసి తల్లిదండ్రులు ఎండలో ఉంటూ అధికారుల రాక కోసం ఎదురు చూశారు. మండలంలో 11వేలకు పైగా ఈకేవైసీ పెండింగ్ లిస్టు ఉండటంతో ఫింగర్ ప్రింట్స్ అప్‌డేషన్ ఆధార్ ఫోన్ నెంబర్ లింకు కోసం గ్రామ సచివాలయానికి వందలాది మంది లబ్ధిదారులు తరలివచ్చారు. మండల కేంద్రంలో ఒకటే ఆధార్ సెంటర్ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోసిగి ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న చిన్ననేలటూరు వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని వేముగోడు, చిన్ననేలటూరు గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బీవీ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడూతూ ఎనిమిది నెలల కూటమి పాలనను చూసి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో వేముగోడు నాయకులు సత్యం స్వామి, మండల కన్వీనర్, నజీర్, నాయకులు చంద్రశేఖర్, తిరుపతయ్య నాయుడు, రంగముని, తిమ్మారెడ్డి, రంస్వామి, సాయినాథ్, గ్రామానికి చెందిన నలుగురు వార్డు మెంబర్లు, మరో 50 కుటుంబాలు, చిన్ననేలటూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఈశ్వర్, సోదరులు, అనుచరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

మంత్రాలయం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురంలో వెలసిన హాజరత్ సయ్యద్ గోకర్ వలి దాదాసాహేబ్ ఉరుసు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జెండాను ఆవిష్కరించి దర్గాలో సమాధికి పట్టువస్త్రం, విశేష పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అలంకరించారు. నైవేద్యాలను భక్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దర్గాను దర్శించుకున్నారు. దర్గా పీఠాధిపతి ఖాదర్‌బాషా శాలువ, పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శేఖర్ స్వామి, సయ్యద్‌వలి, బడేసాహబ్, అబ్దుల్ గని, మహ్మద్ ఖాద్రి, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

సజ్జలగుడ్డంలో పేకాటరాయుళ్ల అరెస్టు

కోసిగి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలోని గౌళ్ల మారెమ్మ వనం సమీపంలో పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జి.హనుమంతరెడ్డి తెలిపారు. వారి నుంచి పేకముక్కలు, రూ.24,550 స్వాధీనం చేసు కుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. దాడుల్లో ఏఎస్ఐ తిరుపాల్ నాయక్, కానిస్టేబుళ్లు మునిస్వామి, శ్రీనివాసులు, షేక్షావలి, లక్ష్మీనారాయణ, మనోజ్‌గౌడు, రాంప్రతాప్ ఉన్నారు.

'గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి'

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గొర్రెకాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి పరిష్కరించాలని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ కోరారు. శుక్రవారం కేంద్ర సహాయక మంత్రి ఎస్.పీ. సింగ్ బఘేల్‌కు ఢిల్లీ పార్లమెంట్ భవన్‌లో వినతి పత్రం అంద జేశారు. అలాగే సత్కరించి కనకదాసు చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కరువ సంఘం నాయకులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు ఏసేపు, రాజు, ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదన్నారు. ప్రధానంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈరన్న, బజారి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే సమాజ పురోగతి సాధ్యం



గోమాతకు పూజలు చేస్తున్న హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత తోనే సమాజం పురగోతి సాధ్యపడు తుందని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంటకరెడ్డి అన్నారు. గోనెగండ్ల మండలంలోని అలువాల గ్రామంలో లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయంలో నాలుగు రోజులుగా ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. చివరిరోజు శుక్రవారం గోమాత పూజ, కుంకమర్చాన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మ ప్రచారకులు డమాం జగదీష్ చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తుల ను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, తిమ్మాపురం మురహరిరెడ్డి, సోమన్న, టైలర్ సోమన్న, కర్రెన్న, నారాయణరెడ్డి, బోయ వెంకటేష్, జయరాముడు, సోమిరెడ్డి, కౌలుట్ల, తులసి, నారాయణ పాల్గొన్నారు.

రేపు శ్రీరామనవమి

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీతారామాంజినేయ స్వామి దేవాలయం, చింతలా ముని నల్లారెడ్డి దేవాలయం, ఆంజేయస్వామి దేవాలయాలను భక్తులు రంగులు, ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. రెండు రోజులుగా దేవాలయాలకు రంగు వేస్తున్నారు.

నేడు గంజహళ్లిలో బడేసాహేబ్ మాస పూజలు: గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామంలో వెలసిన బడేసాహెబ్ స్వామి వారి మాస పూజలు శనివారం జరగనున్నట్లు దర్గా ధర్మకర్త, పీఠాధిపతులు తెలిపారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. స్వామివారి జీవసమాధిని ప్రత్యేక పూలతో అలంకరించారు. సాయంత్రం నృత్యప్రదర్శన, భజనగీతాలు, అన్నమయ్య సంకీర్తనలు, ఖవ్వాలి గీతాలాపన జరుగుతున్నట్లు తెలిపారు.

స్వీయ రక్షణ అవసరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తిటీమ్ పోలీసు

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆడ బిడ్డకు స్వీయ రక్షణ ఎంతో అవసరమని ఎమ్మిగనూరు సబ్ డివిజన్ శక్తి టీమ్ పోలీస్ నాగన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లను గురించి అవగాహన కల్పించారు. అలాగే ఆడపిల్లలు స్వయంగా తనను తాను ఎలా రక్షించుకోవాలో వివరించారు. అత్యవసర పరిస్థితులలో 112 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయడం వంటి విషాయలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షహనాపర్వీన్, ఉపాధ్యాయురాలు శ్రీదేవి, హరిత, ఉమా, అనసూయ, రాణి, సౌమ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితం

మంత్రాలయం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితమని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, మండల వైద్యాధికారి గోవిందమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంచార చికిత్స పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లి, జన్మించిన ఏ శిశువైనా మృతి చెంద కూడదన్న నినాదంతో ప్రభుత్వం ఆరోగ్య సేవలు అందిస్తుందన్నారు. గర్భిణులు సమయానికి పోషకాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జయంతి, ఆశా వర్కర్ సుజాత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని సీపీఐ నాయకులు కుమ్మరి చంద్ర, సీనియర్ నాయకులు హనుమంతులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లుకుంట గ్రామంలో బీకేఎంయు ఆధ్వర్యంలో అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 11గంటలైనా తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తాయన్నారు. మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో రాజు, నాగరాజు, తిక్కన్న, వీరేష్, జయకృష్ణ, బజ్జయ్యలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

కౌతాళం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఎన్‌సీడీసీడీ, ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి శైలేష్ కుమార్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి 18సంవత్సరాలు పైబడిన వారికి వైద్య పరీక్షలు చేపట్టి రికార్డులను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, ఆర్‌బీఎస్‌కే సూపర్ వైజర్ సత్యం ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.